10 YEAR ANNIVERSARY 2014 - 2024

# పెన్ పవర్

తెలంగాణ రౌండప్

గురువారం | 13 ఫిబ్రవరి 2025 | పేజీలు 8

# జేఈఈ మెయిన్స్‌లో.. వశిష్ట్‌గౌడ్ సత్తా..

## 2025 ఫలితాల్లో 98.14.. సత్తా చాటిన మహబూబాబాద్ కుర్రోడు..

**మహబూబాబాద్, పెన్ పవర్, ఫిబ్రవరి 12:** జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో మహబూబాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు ఉమ్మగాని మధు కృష్ణవేణిల పెద్ద కుమారుడు వశిస్ట్ గౌడ్ 98.14 శాతంతో ఉత్తమ ప్రతిభను కనపరిచాడు.. జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకు సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు ఆనందం వ్యక్తం చేశారు.. మొదటి సారిగా మానుకోటలో జేఈఈ ర్యాంకు సాధించిన వశిష్టకు మార్గదర్శి బీఈడీ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ ఉమ్మగాని అరుణ్ కుమార్, మహబూబాబాద్ జిల్లా టియుడబ్ల్యుజే (ఐజేయు) అధ్యక్షులు చిత్తనూరి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపెల్లి శ్రీహరి, టియుడబ్ల్యుజే (143) నాయకులు గాడిపెల్లి శేఖర్, సీనియర్ జర్నలిస్ట్ గాడిపెల్లి యాదగిరితో పాటు తోటి జర్నలిస్టులు, పలువురు గౌడ సఘం సభ్యులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు..



జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన వశిష్ట్‌గౌడ్..మహబూబాబాద్

- నోటిఫికేషన్ విడుదల కోసం మీటింగ్స్
- ముందు పంచాయతీ, తర్వాత ఎంపీటీసీ
- పక్కా వ్యూహంతో కాంగ్రెస్ అడుగులు
- రాజకీయ పార్టీలతో ఈసీ సమావేశం
- సీసీసీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

-2లో





# ఏ క్షణమైనా.. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ !

**హైదరాబాద్ పెన్ పవర్:** పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే అవకాశం ఉంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42% సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది.

-2లో

# తెలంగాణ సచివాలయంలో ఆరో అంతస్తు నుండి ఊడిపడిన పెచ్చులు

- రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుపై పడిన పెచ్చులు
- పెచ్చులు ఊడిపడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో తప్పిన ప్రమాదం
- ఆరో అంతస్తులోనే సీఎంవో, సీఎస్ కార్యాలయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవనంలో పెచ్చులు ఊడిపడి ఒక కారు ధ్వంసమైంది. కాసేపటి క్రితం సచివాలయ భవనంలోని ఆరో అంతస్తు నుండి పెచ్చులు ఊడిపడి పార్కింగ్‌లో ఉన్న రామగుండం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుపై పడ్డాయి. ఈ ఘటనలో కారు స్వల్పంగా ధ్వంసమైంది.

-2లో

# 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- కులగణన మరోసారి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంపై స్పందించిన కేటీఆర్
- అసంపూర్తి లెక్కలతో అసెంబ్లీలో తీర్మానం చేసిందని విమర్శ
- అలా చేయడం తప్పేనని ప్రభుత్వం అంగీకరించాలని డిమాండ్
- 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్న కేటీఆర్



**హైదరాబాద్ పెన్ పవర్:**కులగణన సర్వే తప్పుల తడకని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, దీనిని తాము స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. కుల గణన సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో, కుల గణనలో పాల్గొనని వారి కోసం ఈ నెల 16 నుంచి 28 వరకు మరోసారి సర్వే చేయనున్నట్లు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ అంశంపై కేటీఆర్ స్పందిస్తూ, అసంపూర్తి లెక్కలతో అసెంబ్లీలో తీర్మానం చేయడం తప్పేనని ప్రభుత్వం అంగీకరించాలని

-2 లో

# శైవక్షేత్రాల్లో ఉపవాసం ఉండే భక్తులకు ఉచితంగా పండ్లు, అల్పాహారం పంపిణీ చేయాలి

- పండుగ కోసం అన్ని శైవ క్షేత్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్న మంత్రి
- భక్తులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచన
- ఆలయాల వద్ద మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశం



## తెలంగాణ సచివాలయంలో ఆరో అంతస్తు నుండి ఊడిపడిన పెచ్చులు

- మొదటి పేజి తరువాయి

పెచ్చులు ఊడిపడిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సచివాలయంలోని ఆరో అంతస్తులోనే ముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కార్యాలయాలు ఉన్నాయి. కొత్తగా నిర్మించిన సచివాలయ భవనం నుండి పెచ్చులు ఊడిపడటం చర్చనీయాంశంగా మారింది.

## 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- మొదటి పేజి తరువాయి

కేటీఆర్ అన్నారు. బీసీలను తీవ్ర మనోవేదనకు గురి చేశారని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
రెండోసారైనా కుల గణన సర్వేను సమగ్రంగా, పారదర్శకంగా చేయాలని సూచించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్ల అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిధిలోకి నెట్టివేస్తే అంగీకరించే ప్రసక్తి లేదని ఆయన అన్నారు.

## మాదాపూర్ లో క్రికెటర్ ధృతి కేసరిని సన్మాన కార్యక్రమం

**హైదరాబాద్ పెన్ పవర్:**క్రీడలు ప్రపంచవ్యాప్తంగా దేశాల మధ్యన అనుబంధాన్ని పెంపొందించడానికి ఉపయోగపడతాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. మాదాపూర్ లో క్రికెటర్ ధృతి కేసరిని సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ మాజీ ఇండియన్ క్రికెట్ కెప్టెన్ అజారుద్దీన్, మాజీ బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.మలేషియా వేదికగా సాగిన మహిళల అండర్ 19 టీ20 ప్రపంచకప్ ను భారత్ సొంతం చేసుకుంది. భారత జట్టులో భాగమైన కేసరి ధృతిని జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి సన్మానించారు. డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్ రావు మాట్లాడుతూ క్రీడలు శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి అని తెలిపారు.జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ..ధృతి కేసరికి భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు రావాలని, తెలంగాణ నుంచి అంతర్జాతీయ స్థాయిలో మహిళా క్రికెటర్లు ఎదగడానికి ప్రభుత్వం తోడ్పాటును అందించేలా చేస్తామని జాతీయ బీసీ దళ్ అధ్యక్షులు దుండ్ర కుమారస్వామి హామీ ఇచ్చారు. ధృతి కేసరి తెలంగాణలో ఎంతో మంది అమ్మాయిలకు ఆదర్శమని, మహిళా క్రీడాకారుల ఎదుగుదలకు బీసీ దళ్ అండగా ఉంటుందని దుండ్ర కుమారస్వామి స్పష్టం చేశారు.

## సీఎం రేవంత్ ను విమర్శించే నైతికత కేటీఆర్ కు లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:**సీఎం రేవంత్ రెడ్డిని విమర్శించే నైతికత కేటీఆర్ హరీష్ రావు లకు లేదని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జలకాంతం అన్నారు. బంజారాహిల్స్ లోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బి ఆర్ ఎస్ నాయకుల తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కేటీఆర్ బీసీల గురించి మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు. ఏళ్ల తరబడి సాగిన వర్గీకరణ పోరాటానికి తెరదించింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ప్రజా రంజకమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని విమర్శిస్తారా మీ స్థాయి ఏమిటంటే నిలదీశారు. బి ఆర్ ఎస్ హయాంలో ప్రతి పనిలో కమిషన్లు తీసుకున్నారని మండిపడారు. మిగులు రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత మీదని అన్నారు. 7లక్షల కోట్లు అప్పులు చేసి 3 లక్షల కోట్లు నొక్కేశారని ఆరోపించారు. అనవసరపు ఆరోపణలతో ప్రజలను రెచ్చగొడితే తగిన విధంగా బుద్ధి చెప్తామని హెచ్చరించారు.

# ఏ క్షణమైనా.. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ !

- మొదటి పేజి తరువాయి

ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42% సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు.

**పక్కా వ్యూహంతో కాంగ్రెస్**

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది.
ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.

**బీసీలకు దాదాపు 23%**

సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23% సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28% స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.

# శైవక్షేత్రాల్లో ఉపవాసం ఉండే భక్తులకు ఉచితంగా పండ్లు, అల్పాహారం పంపిణీ చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఉపవాసం ఉండే భక్తులకు అన్ని శైవక్షేత్రాల్లో ఉచితంగా పండ్లు, అల్పాహారం పంపిణీ చేయాలని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. అన్ని శైవక్షేత్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సూచించారు. మహా శివరాత్రి ఏర్పాట్లపై దేవాదాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, కీసర, ఏడుపాయలు, రామప్ప, మేళ్లచెరువు, పానగల్లు, పాలకుర్తి, వేయిస్థంభాల గుడి, కాశీబుగ్గ శివాలయం, భద్రకాళి తదితర ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయాల వద్ద ఎక్కడా మద్యం అమ్మకాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేకంగా గస్తీని ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ఆలయాలను సమన్వయం చేసుకోవడానికి హైదరాబాద్‌లో ఎండోమెంట్ కమిషనరేట్‌లో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గోదావరి, ఇతర నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నదీ హారతి కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ఆలయాల్లో మహా శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించాలని, అందుకు జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.

# విద్యార్థుల్లో కళా నైపుణ్యాన్ని ప్రోత్సహించాలి



**కరీంనగర్ పెన్ పవర్:** విద్యార్థులు దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని ఉపాధ్యాయుల గుర్తించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.
నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళ మేళ, సైన్స్ ఎగ్జిబిషన్ ను కలెక్టర్ బుధవారం సందర్శించారు.
కస్తూరిబా బాలికల పాఠశాల, వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థులు తయారుచేసిన వివిధ కళాకృతులను పరిశీలించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు అందమైన వస్తువులను స్వతహాగా తయారు చేస్తున్నారని, ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ మేళాను సందర్శించాలని సూచించారు. విద్యార్థుల్లో ఎంతో కళా నైపుణ్యం బాగుందని, దాన్ని వెలికి తీయాలని అన్నారు. ప్రజలు ఈ మేళాను సందర్శించి అందమైన ఆకట్టుకునే కళాకృతులను కొనుగోలు చేయవచ్చని సూచించారు. ఈ మేళాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.
ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి జనార్ధన్ రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

# అందుకే రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారు: కవిత

- వరంగల్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలు కాలేదని విమర్శ
- ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు విశ్వసించలేదని వ్యాఖ్య
- సోనియా, రాహుల్, ప్రియాంక వచ్చి చిలుకపలుకులు పలికారని విమర్శ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇచ్చిన హామీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతోనే రాహుల్ గాంధీ తన వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆయనకు వరంగల్ వచ్చే ధైర్యం లేకుండా పోయిందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వరం గల్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన రైతు డిక్లరేషన్ అమలు కాలేదని ఆమె అన్నారు. ఇచ్చిన మాటను తప్పితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు విశ్వసించడం లేదని, అందుకే ఢిల్లీ నుండి నాయకులను తీసుకువచ్చి ప్రచారం చేయించారని ఎద్దేవా చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వచ్చి చిలుకపలుకులు పలికారన్నారు. తెలంగాణ ప్రజలు రేవంత్ రెడ్డి ముఖం చూసి ఓట్లు వేయలేదని, ఢిల్లీ నేతల ముఖం చూసి ఓట్లు వేశారన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో నేరాలు 20 శాతం పెరిగాయని ఆమె అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఎక్కడో ఒకచోట మతకల్లోలాలు చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు భద్రత కోసం కూడా పోరాటం చేయాల్సి రావడం బాధాకరమన్నారు. కేసీఆర్ మీద అక్కసుతో కేసీఆర్ కిట్‌లను నిలిపివేశారని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం అంటూ బస్సుల సంఖ్య తగ్గించారని విమర్శించారు.

## 1800 కాల్స్ వచ్చాయి.. వైసీపీ వేధింపుల దెబ్బకు హాస్పిటల్‌లో పడ్డాను: పృథ్వీ




**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ నటుడు, 30 ఇయర్స్ ఇండస్ట్రీ పృథ్వీ హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. విశ్వక్ సేన్ 'లైలా' సినిమా ఈవెంట్ లో తాను చేసిన వ్యాఖ్యలను వైసీపీ కార్యకర్తలు తమకు ఆపాదించుకుని, తనను టార్గెట్ చేసి వేధిస్తున్నారని హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ.. తాను ఒక నటుడిగా సినిమా ఫంక్షన్ వేదికపై మాట్లాడిన మాటలను వైసీపీ సోషల్ మీడియా టార్గెట్ చేసిందని చెప్పాడు. తాను ఎవరిని ఉద్దేశించి ఆ మాటలు మాట్లాడలేదని, అక్కడికి వచ్చిన ప్రేక్షకులను నవ్వించడానికే అలా మాట్లాడనని తెలిపాడు. కానీ అది వైసీపీకి ఆపాదించుకుని ప్రచారం చేసుకున్నారని పృథ్వీ చెప్పుకొచ్చాడు.

గత రెండు రోజులుగా తనను సోషల్ మీడియాలో తీవ్రంగా వేధిస్తున్నారని, తన ఫోన్ నెంబర్ వైసీపీ సోషల్ మీడియా గ్రూప్ ల్లో పెట్టి మానసికంగా వేధింపులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు 1800 కాల్స్ చేయించారని, తన భార్యను , తల్లిని , పిల్లలను తిట్టించారని.. వైసీపీ సోషల్ మీడియా వేధింపుల వల్ల తాను హాస్పిటల్‌లో జాయిన్ అయ్యానని పృథ్వీ చెప్పాడు. అనిల్ అనే పేరుతో పోస్టులు పెట్టిన వ్యక్తిపై ఆధారాలతో సహా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపాడు. ఏపీ హోంమంత్రిని కూడా కలిసి త్వరలో ఫిర్యాదు చేస్తానని, వేధించిన వాళ్లపై కోటి రూపాయల పరువునష్ట దావా వేస్తానని నటుడు పృథ్వీ చెప్పాడు.

## ఈ సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరితే.. లక్ష రూపాయల జీతం..
# ఫ్రీగా మందు, 'హ్యాంగోవర్ లీవ్స్'..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగం చేస్తే ఏ సంస్థ అయినా ఒక ఉద్యోగికి ఏం ఇస్తుంది. జీతం ఇస్తుంది. సంవత్సరానికి ఒకసారో.. రెండుసార్లో జీతాలు పెంచుతుంది. ఏ పండగకో.. పబ్బానికో బోనస్‌లు, స్వీటు బాక్స్‌లు ఇస్తుంది. ఇంతకు మించి ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తు్ను ఉద్యోగికి పెద్దగా దక్కేదంటూ ఏమీ ఉండదు. కొన్ని మల్టీ నేషనల్ టెక్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులకైతే ఫుడ్ ప్రొవైడ్ చేస్తుంటారు. ఆటవిడుపు కోసం ఆఫీస్ క్యాంపస్‌లోనే అవీఇవీ ఉంటుంటాయి. కానీ.. జపాన్‌లోని ఒసాకాలో ఉన్న ఈ చిన్న టెక్ కంపెనీ తమ సంస్థలో చేరే ఉద్యోగులకు మందు, విందు కూడా ప్రొవైడ్ చేస్తామని ప్రకటించింది. 'హ్యాంగోవర్ లీవ్స్' కూడా తీసుకోవచ్చని, ఆఫీస్‌కు ఆలస్యంగా వచ్చినా ఎందుకు లేట్‌గా వచ్చావని అడగమని ట్రస్ట్ రింగ్ అనే ఈ జపాన్ టెక్ కంపెనీ ప్రకటించింది. దఈ జపాన్ కంపెనీ చేసిన వినూత్న ఆలోచన, ప్రకటన ప్రస్తుతం నెట్టింట వైరల్ అయింది. ఈ 'హ్యాంగోవర్ లీవ్స్' గురించి ఆ సంస్థలో ఉద్యోగిగా చేస్తున్న ఒకరు ఏం చెప్పారంటే.. "హ్యాంగోవర్ లీవ్ సిస్టమ్‌ను వినియోగించుకుంటున్నాను. ఉదయాన్నే ఆఫీస్ కు వెళ్లే బదులు మధ్యాహ్నం 12 గంటలకు ఆఫీస్‌కు వెళుతున్నాను. రెండు, మూడు గంటలు ఎక్కువగా నిద్రపోవడం వల్ల మైండ్ అంతా ఫ్రెష్ గా ఉంటుంది. మరింత రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నాను". ఇదీ ట్రస్ట్ రింగ్ ఉద్యోగి చెప్పిన విషయం.

ఈ వినూత్న ఆలోచనపై ట్రస్ట్ రింగ్ కంపెనీ సీఈవో స్పందిస్తూ.. శాలరీ పరిమితుల వల్ల, బడ్జెట్ వల్ల తాను నైపుణ్యం ఉన్న ఉద్యోగులను పొందలేకపోతున్నానని, 'హ్యాంగోవర్ లీవ్ సిస్టం', ఫ్రీ ఆల్కహాల్ ఆలోచన వల్ల శాలరీ కంటే వర్క్ కల్చర్ నచ్చి ఉద్యోగులు జాయిన్ అవుతారన్న నమ్మకంతో ఈ ఆలోచన చేసినట్లు చెప్పారు. ఈ కంపెనీలో స్టార్టింగ్ శాలరీ 1.27 లక్షలు. ఇందులో.. 20 గంటలు ఓవర్ టైం పనిచేసినందుకు కూడా కలిపి చెల్లిస్తారు.

# చిలుకూరు ఆలయ అర్చకుడు రంగరాజన్‌కు కూనంనేని సాంబశివరావు పరామర్శ




**హైదరాబాద్ పెన్ పవర్:**చిలుకూరి బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌ను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు పరామర్శించారు.
రామరాజ్యం వ్యవస్థాపకుడు వీరరాఘవరెడ్డి ఆయనపై దాడి చేసిన విషయం తెలుగు రాష్ట్రాలలో కలకలం రేపింది. ఈ క్రమంలో పలువురు రాజకీయ ప్రముఖులు రంగరాజన్‌ను పరామర్శిస్తున్నారు.
రంగరాజన్‌కు కూనంనేని సాంబశివరావు ధైర్యం చెప్పారు. అందరం అండగా ఉన్నామని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ దాడితో... దాడి చేసిన వారి దీనత్వం, మీ ఔన్నత్యం అందరికీ అర్థమైందని రంగరాజన్‌తో అన్నారు. ఈ దాడి నేపథ్యంలో మీరు అంతకుముందు చేసిన మంచి పనులు వెలుగులోకి వచ్చాయన్నారు. రామరాజ్యం ఆర్మీ పేరుతో దాడికి పాల్పడుతున్న వారు నిజమైన రామభక్తులు కాబోరన్నారు. వారు సూడో భక్తులు అని విమర్శించారు. కానీ రంగరాజన్ నిజమైన రామభక్తులని, దైవభక్తులని ఆయన అన్నారు. రంగరాజన్ నిజమైన హిందువు, నిజమైన దేశభక్తుడు అన్నారు.

## కేంద్రమంత్రి షెకావత్‌కు తెలంగాణ బీజేపీ ఎంపీల విజ్ఞప్తి


- కేంద్రమంత్రి షెకావత్‌ను కలిసిన ఎంపీలు డి.కె. అరుణ, రఘునందన్ రావు, విశ్వేశ్వర్ రెడ్డి
- దేశంలో 12 కోట్ల బంజారాలు ఉన్నారన్న బీజేపీ ఎంపీలు
- కేంద్రం అధికారికంగా జయంతిని నిర్వహించాలని విజ్ఞప్తి




**హైదరాబాద్ పెన్ పవర్:**దేశవ్యాప్తంగా 12 కోట్ల బంజారాలు ఉన్నారని, బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ భారతీయ జనతా పార్టీ ఎంపీలు డి.కె. అరుణ, రఘునందన్ రావు, కొండా విశ్వేశ్వర్ రెడ్డి కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌కు విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ, సంత్ సేవాలాల్ జయంతిని దేశవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలన్నారు. అవసరమైతే ఈ అంశాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకువెళతామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అధికారికంగా జయంతిని నిర్వహించాలని కోరారు. ఈ నెల 15న సంత్ సేవాలాల్ జయంతి ఉందని, ఈ లోపు వీలుకాకపోతే వచ్చే ఏడాదికైనా అధికారికంగా నిర్వహించేలా చూడాలని కోరారు.

# బ్యాన్ చేసిన చైనా యాప్‌లు మళ్లీ భారత్‌లోకి ఎంట్రీ.. ఈ సారి మామూలు ప్లాన్ కాదుగా..!

**హైదరాబాద్ పెన్ పవర్:**న్యూఢిల్లీ: దేశ భద్రతా కారణాల దృష్ట్యా పొరుగు దేశం చైనాకు చెందిన వివిధ యాప్‌లపై భారత్ నిషేదం విధించిన విషయం తెలిసిందే. యువతను ఎంతో ఆకట్టుకున్న పబ్జీ, టిక్ టాక్ వంటి ప్రముఖ యాప్‌లను ఇండియాలో బ్యాన్ చేసింది కేంద్ర ప్రభుత్వం. అయితే.. భారత్ నిషేదం విధించిన చైనా యాప్‌లు కొన్ని మళ్లీ దేశంలోకి రీ ఎంట్రీ ఇచ్చాయి. దాదాపు 36 యాప్‌లు గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ స్టోర్లలో యూజర్లకు అందుబాటులోకి వచ్చాయి. భారత్ బ్యాన్ చేసిన చైనా యాప్‌లు సెలెంట్‌గా మళ్లీ ఇండియా మార్కెట్లోకి రావడం చర్చనీయాంశంగా మారింది. అయితే.. ఈ యాప్‌ల రీ ఎంట్రీకి కారణం భారత్, చైనా దేశాల మధ్య ఇటీవల దౌత్య సంబంధాలు మెరుగుపడటమేనని తెలుస్తోంది. 2020లో గాల్వన్ వ్యాలీ ఘర్షణతో భారత్, చైనా మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దేశ భద్రతను దృష్టిలో పెట్టుకుని చైనాకు చెందిన పలు యాప్‌లను భారత్ నిషేదించింది.
2020లో గాల్వన్ వ్యాలీ ఘర్షణ తర్వాత భారత ప్రభుత్వం యూసీ బ్రౌజర్, షీన్, టిక్‌టాక్‌తో సహా 59 చైనీస్ యాప్‌లపై బ్యాన్ విధించింది. ఆ తరువాత 2022లో పబ్జీ, గరెనా ఫ్రీ ఫైర్ వంటి యాప్‌లపైన కొరడా ఝులిపించింది. ఇలా మొత్తంగా దాదాపు 200 చైనీస్ యాప్‌లపై భారత్ నిషేదం విధించింది. ఇటీవల న్యూఢిల్లీ, బీజింగ్ మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడటంతో ఈ యాప్‌లు తిరిగి భారత్ ర్కెట్లోకి వచ్చినట్లు తెలుస్తోంది.




ప్రస్తుతం చైనాకు చెందిన 36 యాప్‌లు ఐవోఎస్, ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులో ఉన్నాయి. అయితే.. భారత్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చిన చైనా యాప్‌లు కొన్ని భారతీయ కంపెనీల భాగస్వామ్యంతో రాగా.. ఇంకొన్ని కొత్త పేర్లతో మార్కెట్లోకి ఎంటర్ అయ్యాయి. ఎలాగంటే.. చైనాకు చెందిన ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ షీన్.. రిలయన్స్‌తో కలిసి భారత మార్కెట్‌లోకి రీ ఎంట్రీ ఇచ్చింది.

# ఒకే పౌల్ట్రీ ఫామ్ లో 11 వేల కోళ్లు మృతి

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. బర్డ్ ఫ్లూ కారణంగా లక్షల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో ఈ వైరస్ ఎఫెక్ట్ మరింత ఎక్కువగా ఉంది. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమ్మోలంకలోని ఓ పౌల్ట్రీ ఫామ్ లో మూడు రోజుల్లో 11 వేల కోళ్లు మృతి చెందాయి.
మరోవైపు బర్డ్ ఫ్లూ నేపథ్యంలో వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు, జిల్లా అధికారులతో ఈరోజు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వెటర్నరీ వైద్యులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. చనిపోయిన కోళ్లను పరిశీలించి శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని జిల్లాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అచ్చెన్నాయుడు చెప్పారు. పౌల్ట్రీల వద్ద బయో




సెక్యూరిటీ మెజర్స్ అమలు చేయాలని అన్నారు. పౌల్ట్రీల వద్ద రవాణా వాహనాలు సంచరించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంత వరకు సంబంధిత ప్రాంతాల నుంచి కోళ్ల రవాణా నిషేధించాలని ఆదేశాలు జారీ చేశారు.

# చిన్న మార్పులతో పేదరికం నిర్మూలించవచ్చు

**హైదరాబాద్ పెన్ పవర్:**
రిఫ్లెక్షన్ ఆన్ సొసైటల్ ఛాలెంజెస్ పుస్తకావిష్కరణ కార్యక్రమం జూబ్లీహిల్స్‌లోని జర్నలిస్టు కాలనీలో జరిగింది. ఇక్రిసాట్లోని కార్టోగ్రఫి డివిజన్ హెడ్గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చెందిన రచయిత కనగరి ఎస్ఎన్. ప్రసాద్ రచించిన ఈ పుస్తకాన్ని మాజీ టీఎస్పీఎస్సీ సభ్యుడు టి. వివేక్, ఇక్రిసాట్ మాజీ డైరెక్టర్ రీసెర్చ్ ప్రోగ్రాం ఏషియల్ సుహాస్ వాని, వరల్డ్ బ్యాంక్ మాజీ మేనేజర్ ఎక్సటర్నల్ అఫైర్స్ కమ్యూనికేషన్ ఎరిక్ చిస్జీలు ముఖ్య అతిథులుగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత కనగిరి ఎస్ఎన్. ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో పేదరికం నిర్మూలించడంతో పాటు ఎన్నో సామాజిక అంశాలను ఈ పుస్తకంలో ప్రస్తావించినట్లు తెలిపారు. మహిళా సాధికారత, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఆకలి చావులు, పేదరికం, ఆర్థిక విషయాలను తన పుస్తకంలో రాసినట్లు తెలిపారు. చిన్న చిన్న మార్పులను పద్ధతిగా చేస్తే దేశం ఎంతో ముందుకు వెళ్తుందని పేదరికం లేని దేశంగా తయారవుతుందని ఆయన అన్నారు.

# వాలంటైన్స్ డే సేల్... టికెట్ బుకింగ్స్ పై 50 శాతం వరకు తగ్గింపు

- ఈ నెల 12 నుంచి 16 వరకు చేసే బుకింగ్ లకు మాత్రమే ఈ ఆఫర్
- బుకింగ్ తేదీకి, జర్నీ డేట్‌కు మధ్య కనీసం 15 రోజుల వ్యవధి ఉండాలన్న కంపెనీ
- ఇద్దరు ప్రయాణికులకు కలిపి టికెట్ బుక్ చేస్తేనే ఆఫర్ వర్తింపు




**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థ ఇండిగో... వాలంటైన్స్ డే సేల్ ను తీసుకొచ్చింది. ఈ సేల్ ద్వారా విమాన టికెట్ల బుకింగ్స్ పై ఏకంగా 50 శాతం వరకు డిస్కౌంట్ ఆఫర్ ను ప్రకటించింది. అయితే, ఇద్దరు ప్రయాణికులకు కలిపి టికెట్ బుక్ చేస్తేనే ఈ ఆఫర్ వర్తిస్తుందని ఇండిగో తెలిపింది. అలాగే ఈ నెల 12 నుంచి 16 వరకు చేసే బుకింగ్ లకు మాత్రమే ఈ ఆఫర్ వర్తిస్తుందని సంస్థ పేర్కొంది. బుకింగ్ తేదీకి, జర్నీ డేట్‌కు మధ్య కనీసం 15 రోజుల వ్యవధి ఉండాలని వెల్లడించింది. టికెట్ ధరతో పాటు ప్రయాణికులు ట్రావెల్ యాడ్ ఆన్స్‌పైనా డిస్కౌంట్లను పొందవచ్చని కంపెనీ తెలిపింది. ఇక అదనపు బ్యాగేజీ అంశంలో ముందస్తు బుకింగ్ పై 15 శాతం, సీట్ల ఎంపికపై 15 శాతం, ముందస్తుగా బుక్ చేసే మీల్స్ పై 10 శాతం తగ్గింపును ఇస్తామని ఇండిగో తెలిపింది. సంస్థ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, ఇండిగో 6ఈ ఏఐ చాట్‌బాట్, ఎంపిక చేసిన ట్రావెల్ పార్ట్‌నర్స్ వేదికగా టికెట్ బుక్ చేసినప్పుడు ఈ ఆఫర్ పొందవచ్చని తెలిపింది. అలాగే ఇండిగో ఫిబ్రవరి 14న మరో ఫ్లాష్ సేల్ నిర్వహించనుంది. సంస్థ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చేసే తొలి 500 బుకింగ్స్ పై అదనంగా 10 శాతం తగ్గింపును ఇవ్వనున్నట్లు కంపెనీ ప్రకటించింది. దీన్ని 14వ తేదీ రాత్రి 8 గంటల నుంచి 11.59 గంటల మధ్య నిర్వహించనున్నట్లు తెలిపింది.

## ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచి ఆకలి బాధలు తీర్చండి



**హైదరాబాద్ పెన్ పవర్:**బద్వేలు మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఏ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక బద్వేల్ పురపాలక సంఘ కార్యాలయం వద్ద బుధవారం బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ ఏ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం మున్సిపాలిటీ మేనేజర్ సుధీర్ గారికి వినతి పత్రం అందించడం జరిగినది.×

ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసులు మాట్లాడుతూ...

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న123 నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీలలో ఇంజనీరింగ్ విభాగాలైన మంచినీటి నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ, టౌన్ ప్లానింగ్ నిర్వహణ,పిట్టర్స్,మెకానిక్స్, కంప్యూటర్ ఆపరేటర్లు, ఆఫీసు నిర్వహణ, బిల్ కలెక్టర్స్, సూపర్వైజర్స్, వాచ్మెన్, తదితర విభాగాలకు చెందిన సుమారు 13,000 మంది కార్మికులు 20 నుండి 25 ఏళ్లుగా ప్రజలకు ప్రభుత్వం తరపున సేవలందిస్తున్నారని వీరికి 2018 సంవత్సరం వరకు పారిశుధ్య కార్మికులతో పాటు సమానంగా జీతాలు చెల్లించారని ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికుల కంటే తక్కువ వేతనాలు చెల్లించడం సరైనది కాదని, ప్రస్తుతం వస్తున్న 13 వేల రూపాయల వేతనంతో పెరుగుతున్న నిత్యవసర సరుకులు ధరలు, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, అనారోగ్య ఖర్చులు అధికమవడంతో దుర్భరమైన జీవనాన్ని అనుభవిస్తూన్నరని, రాత్రింబగలు ఎండ ,వానలను లెక్కచేయక ప్రమాదకర పనులు నిర్వహిస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 36 తేదీ 01-03-2024 ప్రకారం వేతనాలు పెంచాలని, నిత్యం ప్రమాదకర పరిస్థితులలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రిస్కు అలవెన్స్ చెల్లించాలని, పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు,కిట్లు, యూనిఫారం అందించాలని, అదనపు పనులు కేటాయించినప్పుడు టీఏ డీఏలు చెల్లించాలని, కాంట్రాక్ట్ వర్కర్స్ రెగ్యులైజేషన్ అండ్ యాక్ట్ 1970 ప్రకారం శాశ్వత స్వభావం కలిగి అత్యంత ప్రమాదకర విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజనీరింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, జీవో ఎం ఎస్ నెంబర్ 12 తేదీ 23-01-2024 ప్రకారం ఇంజనీరింగ్ కార్మికులకు సంక్రాంతి పండుగ బోనస్ 1,000/- రూపాయలు చెల్లించాలని, 16 రోజుల సమ్మె కాలపు ఒప్పందాల మేరకు అవసరమైన జీవోలను చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కాలువ నాగేంద్రబాబు, పట్టణ అధ్యక్షులు పులి శ్యామ్ ప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షులు దియ్యాల హరి, సిఐటియు పట్టణ నాయకులు రాయప్ప,ఇంజనీరింగ్ కార్మికులు ప్రసాదు,నరసయ్య, ఆదినారాయణ,నాగ సుబ్బారెడ్డి,గురయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ అధికారులకు సిబ్బందికి వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్



**హైదరాబాద్ పెన్ పవర్:** జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బందికి వార్షిక మొబైలైజేషన్ లో భాగంగా ఈరోజు జిల్లాలోని సార్ధపూర్ బెటాలియన్ లో గల ఫైరింగ్ రేంజ్ నందు ఫైరింగ్ శిక్షణ ఇచ్చి ఫైరింగ్ ప్రాక్టీస్ చేయించడం జరిగింది.

వార్షిక శిక్షణలో భాగంగా జిల్లాలో పని చేస్తున్న, అధికారులకు సిబ్బందికి ఇచ్చే ఫైరింగ్ శిక్షణను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పర్యవేక్షించారు. అనంతరం ఎస్పీ కూడా ఫైరింగ్ ప్రాక్టీస్ చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అందరూ కూడా అధునాతన టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడం తో పాటుగా అన్ని రకాల ఆయుధ పరిజ్ఞానం కూడా కలిగి ఉండాలని, సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు శిక్షణలు ఎంతగానో ఉపయోగ పడతాయని అన్నారు.ఈ శిక్షణలో నేర్పించిన మెలకువులను శ్రద్ధతో అభ్యసించి సమయానుకూలంగా శాంతిభద్రతలు పరిరక్షణకు ఉపయోగించాలని అన్నారు. ఫైరింగ్ లోఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులను సిబ్బందిని ఎస్పీ అభినదించారు.

ఈ శిక్షణలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, సిఐలు, ఆర్ఐ లు, ఎస్సై లు ఆర్.ఎస్ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

## గొంగడి త్రిషకు సత్కారం

**హైదరాబాద్ పెన్ పవర్:** అండర్-19 మహిళల టీ-20 ప్రపంచకప్ లో సత్తా చాటిన గొంగడి త్రిషను ఏఆర్కే ఫౌండేషన్ ఘనంగా సత్కరించింది. ఆరేళ్లుగా త్రిషకు స్పాన్సర్ గా ఏఆర్కే ఫౌండేషన్ ఉంది. ఆమె సాధించిన విజయంపై ఏఆర్కే ఫౌండేషన్ చైర్మన్ రామ్ రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. హైదరబాద్ బంజారాహిల్స్ లో నిర్వహించిన కార్యక్రమంలో.... బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, బిసిసిఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎంఎస్కే ప్రసాద్ పాల్గొన్నారు. చిన్న విజయమైనా... వారిని గుర్తించి సత్కరిస్తే ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని పుల్లెల గోపీ చంద్ అన్నారు. త్రిష...ఎంతో మంది మహిళలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు.

## ఆంధ్రా కోళ్లు వెనక్కు?

**సూర్యాపేట పెన్ పవర్:** తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు కోదాడ మండలం, రామపురం చెక్ పోస్టు దగ్గర పశువైద్య, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు జరిగాయి. ఆంధ్ర నుంచి కోళ్ల రవాణా చేస్తున్న వాహనాలను నిలిపివేసారు. కోళ్లల్లో వచ్చే బర్డ్ ఫ్లో వ్యాధి వ్యాప్తి చెందకుండా అంతర్ రాష్ట్రాల కోళ్ల రవాణా, కోళ్ల దాణాను తెలంగాణలోకి అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. తెలంగాణలోకి ప్రవేశిస్తున్న కోళ్ల రవాణా చేస్తున్న బులోరా వాహనాన్ని వెనక్కి పంపించారు.

## తక్కువ పెట్టుబడిఅధిక దిగుబడులపై
# రైతన్నలకు అవగాహన

**హైదరాబాద్ పెన్ పవర్:**సేంద్రియ ఎరువులు రైతన్నలకు నేస్తాలని తద్వారా అధిక పంటల దిగుబడి పెంచడానికి రైతన్నలు సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ ఎల్ పి మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బిల్లా రాజేష్ యాదవ్, ఏ ఎన్. వినీత్ లు అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా మహానంది మండలం నంది పల్లె గ్రామంలో వినూత్న ఆగ్రోటిక్ఎల్.ఎల్.పిఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగు విషయంలో రైతులు అనేక సమస్యలను కంపెనీ ప్రతినిధులతో సంప్రదించారు. పంటల తెగుళ్లు తట్టుకుని అధిక దిగుబడి సాధించింది వినూత్న అగ్రి టెక్ ఎల్.ఎల్. పి వారి ఉత్పత్తులైన సేంద్రియ ఎరువులనురైతు సోదరులు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు.రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్ జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ , టర్బో కే జి ఎఫ్6, రోషిని, ఉజ్వల్ , త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృధ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33%+ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ కే ఎం ఎస్-22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సం?రాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తూన్నారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## అనాధలను అక్కున చేర్చుకోవాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**సూర్యాపేటప్రతిఒక్కరూ సమాజ సేవ పట్ల భాగస్వాములు కావాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ పాలకమండలి సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా, మునగాల మండలం, ముకుందపురం గ్రామంలో.. ఇందిరా వృద్ధ అనాధ ఆశ్రమంలో.. 11 లక్షల రూపాయలతో దాతలు శ్రీనివాస్, ఇందిరా సహకారంతో నిర్మించిన నూతన భవనాలను ఆయన ప్రారంభించారు. అందరున్నా అనాధలుగా ఆశ్రమంలో జీవిస్తున్నారనీ.. అలాంటి వారిని చేరదీసి అక్కున చేర్చుకోవడం గొప్పతనం అని అన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యునిగా.. ఇందిరా వృద్ధ అనాధ ఆశ్రమానికి అన్నివిధాలుగా సహకరిస్తానని తెలిపారు. తిరుపతి దేవాలయం దేశంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రమని నర్సిరెడ్డి కొనియాడారు. భవన నిర్మాణానికి సహకరించిన శ్రీనివాస్- ఇందిరా దంపతులను నర్సిరెడ్డి సన్మానించారు

# మామిడి పంట పండే నా



**హైదరాబాద్ పెన్ పవర్:**మామిడి ఈ ఏడాదైనా పంట పండి చేతికి అందేనా అని రైతులు వేయి కళ్ళతో ఎదురుచూస్తున్నారు. మామిడి పైనే తమ ఆశలన్నీ పెట్టుకున్నామని కరువు బారిన పడిన మామిడి రైతులు వాపోతున్నారు. గత రెండేళ్లుగా తీవ్రంగా మామిడి నష్టాలు మిగిల్చిందని ఈసారి అరకొరగా కురిసిన వర్షాలకు ఆలస్యంగా నైనా మామిడి చెట్లు పూతకు వచ్చాయి. ప్రస్తుతం 50 శాతం మేరకు చెట్లు పూత పూసాయి. దీంతో మోడు బారిన మామిడి రైతుల ఆశలు చిగురించాయి. పూతలు సాధారణంగా డిసెంబర్ మాసంలో వస్తుంటాయి. కానీ ఏడాది ప్రతికూల వాతావరణంతో పూతలు ఆలస్యంగా జనవరి చివరి మాసంలో వచ్చాయి. దీంతో దిగుబడి ఆలస్యం అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు నవంబర్ ,డిసెంబర్ మాసాలలో చిరుజల్లులు కురవడంతో పిచికారి చేసిన మందులతో ఆలస్యంగా నైనా మామిడి చెట్లు పూతకు వచ్చాయి గత మూడేళ్లుగా మామిడి దిగుబడులు సక్రమంగా లేకుండా పోయా ని రైతులు అంటున్నారు. మామిడి డిసెంబర్ మాసంలో పూతలు వచ్చి ఫిబ్రవరి నెలకు పిందెసైజు కాయలు వచ్చి ఉండాలి. అలాంటిది ప్రస్తుతం పూత దశలోనే ఉంది. దీంతో కాయలు ఏప్రిల్ మాసం ఆఖరికి వచ్చే అవకాశాలు ఉన్నాయి. విజయవాడ చిత్తూరు తమిళనాడు తదితరు ప్రాంతాలకు చెందిన మామిడికాయలు మార్కెట్లోకి ముందుగానే వచ్చేస్తాయని రైల్వే కోడూరు , రాయచోటి రాజంపేట గుర్రంకొండ చిన్నమండెం మార్కెట్లకు మామిడికాయల డిమాండ్ ఉంటుందా లేదా అన్న సందేహం రైతులు వ్యాపారంలో వ్యక్తమవుతోంది రైల్వే కోడూరు, రాజంపేట, రాయచోటి ,చిన్నమండెం, లక్కిరెడ్డిపల్లె, చక్రాయిపేట, గుర్రంకొండ మండలాల్లో అత్యధికంగా మామిడి తోటలను రైతులు సాగు చేస్తున్నారు. ఈ సాగుకు ఎకరాకు 60 వేల వరకు ఖర్చు వస్తోందని, అన్ని అనుకూలిస్తే ఆదాయం రూ.లక్ష నుంచి లక్షన్నర వరకు ఉంటుందని రైతులు తెలిపారు. రకాన్ని బట్టి సంవత్సరానికి రెండు కాపుల దిగుబడి వస్తుంది. కడప ,ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముందుగా వీరబల్లి, సుండుపల్లి, చిన్నమండెం ప్రాంతాల నుంచి మామిడి పూతలు వస్తుంటాయి. అయితే ఈ ఏడాది ఆలస్యం కావడంతో పీలేరు, దామలచెరువు, చిత్తూరు ప్రాంతాలలో ముందుగా డిసెంబర్ మాసంలోనే యధావిధి గానే పూతలు వచ్చాయి. ఈ ప్రాంతాలలో చెట్టుకు పిందెలు కూడా కాసాయి .ఖాదర్, పులిహోర, పోతాపురి ,నీలం ,మల్లిక, వేనిషా, మల్గూబ, నూనె పసందు, కాలేపాడు తో పాటు నాటు రకాలు, ఊరగాయ కాయల మామిడి రకాలను రైతులు సాగు చేస్తుంటారు. రైల్వే కోడూరు, దామలచెరువు పెద్ద మార్కెట్లతో పాటు మిగిలిన ప్రాంతాలలో ఉమ్మడి కడప చిత్తూరు రెండు జిల్లాల్లో సుమారు 100 వరకు మార్కెట్లు ఉన్నాయి. ఇక్కడ నుంచి ఇతర రాష్ట్రాలకు రైతులు వ్యాపారులు ఎగుమతి చేస్తుంటారు. ఇక్కడ పండించే మామిడి రుచి రంగు వాసన ఉంటుంది .అందువల్ల భారతదేశంలోనే వీరబల్లె బెనిషా కు మంచి డిమాండ్ ఉంది. అలాగే రైల్వే కోడూరు, దామల్చెరువు ప్రాంతాల నుంచి ఢిల్లీ ముంబై తమిళనాడు కేరళ ఆగ్రా తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి ఈ మూడు నెలల పాటు 200 కోట్లకు పైగా వ్యాపారం చేస్తుంటాను. గుత్తి ,గుంతకల్లు, ఆళ్లగడ్డ, నంద్యాల, కడప, అనంతపురం తదితరు ప్రాంతాల నుంచి కూలీలు సీజన్లో ఉండి ఇక్కడ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతుంటారు. సుమారుగా ఇతర జిల్లాల నుంచి 2000 మంది వరకు కూలీలు దామల్చెరువు, రైల్వే కోడూరు ప్రాంతాల మార్కెట్లకు వస్తుంటారు. నాణ్యమైన కాయలు మరింత ధర పలుకుతున్నాయి. మచ్చ లేకుండా బాగా నాణ్యతగా ఉంటే వాటిని గ్రేడింగ్ చేసి మరింత అధిక ధరకు విక్రయిస్తుంటాడు. దీంతో రైతులు నేరుగా ఇతర ప్రాంతాల వ్యాపారులకు ఇలాంటి నాణ్యత గాయాలు అమ్ముకుంటూ అధిక మొత్తంలో సొమ్ము చేసుకుంటూ ఉంటారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో దిగుబడి లేకపోవడంతో వర్షాలు లేక దిగుబడును లేక మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. నవంబర్, డిసెంబర్ నెలలో కురిసిన జల్లులకు ఆలస్యంగా నైనా మామిడి చెట్లు 50% మేరకు పూతలు వచ్చాయి. దిగుబడులు కూడా ఆశాజనకంగానే వస్తున్నాయని రైతులు గంపెరాశతో ఉన్నారు. ఇప్పటికే సాగు ఒక ఎకరా సాగు కోసం 70 వేల వరకు ఖర్చు చేశామని, రెండు దఫాలుగా మందులు పిచికారీ చేశామని పలువురు రైతులు తెలిపారు .కాయలు వచ్చే సమయానికి డిమాండ్ ఉంటే పెట్టిన ఆదాయం చేతికి అందుతుందని అంతో ఇంతో చేయికి ఆదాయం వస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈదురు గాలులు, ప్రకృతి వైపరీత్యాలు తోబాటు మార్కెట్ల గిట్టుబాటు ధరలు ఉంటే ఈ పూతతోనైనా ఖర్చులు పోను ఎకరాకు 20000 రూపాయలు అయినా చేతికి అందుతుందని రైతులు తెలుపుతున్నారు.

## ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో అవసరమైన మరమ్మత్తుల
# నిధులకు సంబంధించిన అంచనాలు శనివారం లోపు పంపండి

**హైదరాబాద్ పెన్ పవర్:**వసతి గృహాల మరమ్మత్తులకు సంబంధించిన అంచనాల ప్రతిపాదనలు శనివారం లోపు పూర్తి స్థాయిలో పంపాలని, శాఖాపరమైన నిధులకు అదనంగా అవసరమైన నిధులను సిఎస్ఆర్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్, ఎంపీ లాడ్స్ తదితర వాటిని వినియోగిస్తున్నామని, అవసరమైన మరమ్మత్తుల మేరకు అంచనాలు తయారు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్ ఆదేశించారు.బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ నుండి సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో, అలాగే మహాత్మా జ్యోతీ రావు పూలే, డా.బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల సమన్వయ కర్తలతో, ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో కనీస అవసర మరమ్మత్తులను త్వరితగతిన సంబంధిత శాఖ అధిపతులు గుర్తించి వాటికి అవసరమైన నిధులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి రానున్న శనివారం నాటికి పరిపాలన అనుమతులకు సమర్పించాలని ఆదేశించారు. శాఖాపరమైన నిధులకు అదనంగా అవసరమైన నిధులను పలు మార్గాల ద్వారా సిఎస్ఆర్, ఎంపీ లాడ్స్, డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ( డిఎంఎఫ్) సమీకరించి మరమ్మత్తులు చేపడుతున్నామని, అవసరమైన మరమ్మత్తులు మరుగుదొడ్ల రిపేరీ, రన్నింగ్ వాటర్ ఉండేలా ఏర్పాటు, ప్రతి కొళాయికి ట్యాప్ ఉండేలా, ట్యూబ్ లైట్లు ఏర్పాటు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఎల్ఈడి బల్బుల ఏర్పాటు, కిటికీలకు దోమల మెష్, అన్ని గదులకు తలుపులు, గదులలో లీకేజ్ లేకుండా మరమ్మత్తులు, ఫ్లోరింగ్ మరమ్మత్తులు, ఆర్వో త్రాగు నీటి ప్లాంట్ వంటి ఏర్పాటుకు అంచనాల ప్రతిపాదనలు పూర్తి స్థాయిలో ఉండాలని సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ మరమ్మతుల కొరకు ఇంజినీరింగ్ అధికారులు నిధులను సకాలంలో సద్వినియోగం చేసి పనులు నాణ్యతగా చేపట్టాలని, ఏదైనా పొరపాట్లు చేస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయని అధికారులను హెచ్చరించారు. మరుసటి సమీక్ష సోమవారం నాడు ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

# మినీ మేడారం జాతరకు భక్తులు



**వరంగల్, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** మేడారం సమ్మక్క సారలమ్మలంటే కోట్లాదిమంది భక్తులకు ఎంతో నమ్మకం. బుధవారం ఉదయం మినీ మేడారం జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. నాలుగు రోజులపాటు మినీ మేడారం జాతర కొనసాగనుంది. గిరిజన పూజారులు ఆదివాసీ గిరిజన ఆచార సంప్రదాయాల పద్ధతిలో వనదేవతలకు పూజలు నిర్వహిస్తారు. ఉదయం పూజారులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో జాతర ప్రారంభమైంది. జాతరకు భక్తులు పోటెత్తనున్నారు. జాతరకు తరలివచ్చే భక్తుల కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఆర్టీసి 400 ట్రిప్పులను నడుపుతుంది. ములుగు జిల్లా అభయారణ్యంలో కొలువైన వందేవతల మహాజాతర ప్రతి రెండు సంవత్సరాల కోసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజు నుండి నాలుగు రోజుల పాటు నిర్వహించడం ఆదివాసీ గిరిజనుల ఆనవాయితీగా వస్తుంది. అయితే ప్రతి ఏటా ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. దీంతో మహాజాతర నిర్వహించిన వచ్చే ఏడాదిని మేడారం మినీ జాతరగా నిర్వహిస్తున్నారు ఆదివాసీ గిరిజన పూజారులు. వందేవతలపై భక్తులకు అపారమైన నమ్మకం ఉండడంతో మినీ మేడారం జాతరకు సైతం భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ ఏడాది మినీ మేడారం నేటి నుండి 15 తేదీ వరకు జాతర జరగనుంది. ఈ జాతరలో మహాజాతర సమయంలో ఎలాంటి పూజలు నిర్వహిస్తారో ఇప్పుడు ఇదే పద్ధతిలో పూజలు నిర్వహిస్తారు. మినీ జాతరకు సరిగ్గా వారం రోజుల ముందు మేడారం గ్రామంలోని సమ్మక్క ఆలయంలో ఆదివాసీ పూజారులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదే సమయంలో కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయంలో, కొండాయి గ్రామంలో గోవిందరాజులకు, పూనుగొండ్ల లో పగిడిద్ద రాజు ఆలయంలో ఆదివాసీ గిరిజనులు పూజలు చేస్తారు. అదే విధంగా లాస్ట్ బుధవారం రోజు ఆయా ఆయా ఆలయాల్లో పూజారులు గుడిమెలిగె పండుగను నిర్వహించారు. ములుగు గట్టమ్మ వద్ద నాయకపోడు పూజారులు ఎదురుపిల్ల వేడుక నిర్వహించారు. అదే సమయంలో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరకు అంకురార్పణ చేశారు.

పూజలు మాత్రమే... వనదేవతలు గద్దెలపైకిరారు..

మినీ మేడారం జాతరలో ఆదివాసీ గిరిజన పూజారులు వనదేవతలకు పూజలు మాత్రమే నిర్వహిస్తారు. మహాతర సమయంలో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు ను గద్దెల పైకి తీసుకువైవచ్చి ప్రతిష్టిస్తారు. అయితే మినీ మేడారం జాతరలో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజు పూజారులు ఆచార సాంప్రదాయాల ప్రకారం పూజలు నిర్వహిస్తారు. భక్తులు వదేవతలకు బంగారం (బెల్లం), పసుపు, కుంకుమతో చీరా చార సమర్పించుకుంటారు. ఎదురుకొళ్లు, మేకలను కూడా వందేవతలకు బలివ్వడం భక్తుల నమ్మకం. మినీ మేడారం జాతరకు 15 లక్షల నుండి 20 లక్షల వరకు భక్తులు తరలితనుండడంతో ములుగు జిల్లా యంత్రాంగం భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర్ తెలిపారు.

# భక్తి మార్గముతో సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ మార్గదర్శకుడిగా నిలిచిన సంత్ రవిదాస్ జీ

**హైదరాబాద్ పెన్ పవర్:** భక్తి ఉద్యమంలో విశిష్టమైన స్థానం సంపాదించిన మహనీయుడు, సామాజిక సమానత్వానికి మార్గదర్శకుడు సంత్ రవిదాస్ మహారాజ్ జీ జయంతి వేడుకలు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్. కుమార్ ముఖ్య అతిథిగా హాజరై సంత్ రవిదాస్ జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహిస్తూ, భక్తి మార్గాన్ని ఆశ్రయించి సమాజ మార్గదర్శకుడిగా నిలిచిన సంత్ రవిదాస్ జీ తన కీర్తనల ద్వారా సమరసతకు కొత్త దారి చూపించారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత చింతా సాంబమూర్తి, ఎస్సీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు వేముల అశోక్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి కిరణ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

**సామాజిక సమానత్వం కోసం సంత్ రవిదాస్ సేవలు :**

"మన్ చాంగా, తో కథోటి మే గంగా" (మనసు స్వచ్ఛంగా ఉంటే ఎక్కడైనా పవిత్రత ఉంటుంది) అనే సందేశాన్ని ప్రచారం చేస్తూ, సంత్ రవిదాస్ జీ భక్తి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు. ఆయన జీవితమంతా కుల, మత వివక్షను తొలగించేందుకు, సామాజిక సమరసతను నెలకొల్పేందుకు అంకితమయ్యారు. వివక్షకు గురైన వర్గాలకు మద్దతుగా నిలిచి, ఆర్థిక, సామాజిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి తోడ్పడ్డ ఆయన, గురు గ్రంథ్ సాహిబ్ లో తన కీర్తనలతో ప్రత్యేక స్థానం సంపాదించారు.

**నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చర్యలు :**

సంత్ రవిదాస్ జీ సమాజ సేవ, సామాజిక సమానత్వం కోసం చేసిన విశేష కృషికి గౌరవార్థం నరేంద్ర మోదీ ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టింది. వారణాసిలో సంత్ రవిదాస్ మెమోరియల్ కాంప్లెక్స్ నిర్మించింది. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం అధికారికంగా సంత్ రవిదాస్ జీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. సమాజంలోని అణగారిన వర్గాల సాధికారతకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎస్. కుమార్ వెల్లడించారు. సామాజిక సమానత్వం, ఆధ్యాత్మికత, శాంతి, సమరసత కోసం అహర్నిశలు కృషి చేసిన సంత్ రవిదాస్ జీ జీవితం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆయన బోధనలు నేటికీ సమాజానికి మార్గదర్శనం చేస్తూనే ఉన్నాయి. భారత ప్రభుత్వం ఆయన సేవలకు గౌరవార్థంగా అనేక అభివృద్ధి పనులను చేపట్టి, భవిష్యత్ తరాలకు ఆయన సందేశాన్ని చాటిచెప్పే విధంగా ముందుకు సాగుతోంది. ఈ సందేశాన్ని అందరికీ చేరవేసి, సమాజంలో సమానత్వం, భక్తి మార్గాన్ని కొనసాగించడమే నిజమైన నివాళి అని ఎస్. కుమార్ పేర్కొన్నారు.

## నల్గొండను బంగారు కొండ చేస్తా



**నల్గొండ, ఫిబ్రవరి 12, పెన్ పవర్:** రానున్న రెండేళ్లలో ఎస్ఎల్బీసీ సొరంగం పూర్తి చేస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి. నల్గొండను బంగారు కొండగా మారుస్తామన్నారు. ప్రతీ ఎకరాకు నీళ్లు ఇస్తామన్నారు. ప్రతీ ఇంటికి త్రాగు కచ్చితంగా ఇస్తామని మనసులోని మాట బయటపెట్టారు. బ్రహ్మణ వెల్లంల ప్రాజెక్టు ద్వారా రాబోయే పది రోజుల్లో దాదాపు 40 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని, మే నాటికి లక్ష ఎకరాలకు సాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. 70 శాతం పూర్తయిన ఎస్.ఎల్.బీ.సీ సొరంగం పనులను, పదేళ్లు పాలించిన కేసీఆర్ సర్కార్ పక్కన పెట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అమెరికాకు వెళ్లి బోరింగ్ స్పేర్ పార్ట్స్ తెప్పించడం జరుగుతుందన్నారు మంత్రి. నల్గొండ జిల్లా నార్కట్ పల్లి మండలంగోపలాయిపల్లి శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. తిరు కళ్యాణంలో పాల్గొని స్వయంగా స్వామివారి పల్లకి మోశారాయన. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, ఆలయానికి కూతవేటు దూరంలో బ్రహ్మణ వెల్లంల ప్రాజెక్టు నిర్మాణం జరుగుతుందన్నారు. రాబోయే రోజుల్లో మరింత అద్భుతంగా ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఆనాడు స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎస్.ఎల్.బీ.సీ సొరంగాన్ని మంజూరీ చేయించామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో సొరంగం పనులు పూర్తి చేస్తామన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి కృష్ణమ్మను వేణుగోపాలస్వామి చెంతకు చేరుస్తామని తెలియజేశారు. తెలంగాణపై వేణుగోపాల స్వామివారి ఆశీస్సులతో పాడి పంటలు, సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలని వేడుకోవడం జరిగిందన్నారు. చెరువు గట్టు ఆలయం అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచామని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. అలాగే వేణుగోపాల స్వామి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తామన్నారు. చెరువుగట్టు జాతర తర్వాత ఈ ప్రాంతంలో రెండో పెద్ద జాతర వేణుగోపాలస్వామి వారి జాతర అని తెలిపారు.

## శేరిలింగంపల్లి లో ఫుట్ పాత్ ఆక్రమణల తొలగింపులు

**రంగారెడ్డి పెన్ పవర్:** చందానగర్ సర్కిల్ పరిధిలోని మియాపూర్ మెట్రో స్టేషన్ నుండి బి హెచ్ ఈ ఎల్ చౌరస్తా వరకు ఫుట్ పాత్ ఆక్రమణలను జి హెచ్ ఎం సి అధికారులు తొలగించారు. మాదిన గూడ నుండి సంగారెడ్డి వరకు సిక్స్ లైన్ రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డు కి ఇరువైపులా ఆక్రమణల తొలగింపులు జరిగాయి. చందానగర్ టౌన్ ప్లానింగ్,లా అండ్ ఆర్డర్ మరియు ట్రాఫిక్ పోలీసు అధికారుల పర్యవేక్షణ లో తొలగించారు.

# తెలంగాణలో ఏపీ కోళ్లు బ్యాన్.




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగురాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ టెన్షన్ నెలకొంది. ఏపీలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వైరస్‌తో కోళ్లు మృత్యువాత పడతున్నాయి. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమోలులంకలోని ఓ ఫౌల్ట్రీ ఫామ్‌లో భారీగా కోళ్లు మృత్యువాత పడ్డాయి. 24 గంటల్లో 10 వేల కోళ్లు మృతి చెందినట్లు లెక్కలు వేశారు. చనిపోయిన కోళ్లను జనావాసాలకు దూరంగా డిస్పోజ్ చేయాలని వెటర్నరీ అధికారులు సూచించారు. దీంతో చనిపోయిన కోళ్లను భూమిలో పూడ్చిపెట్టారు ఫౌల్ట్రీ యజమాని.మరోవైపు.. గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. గోదావరి జిల్లాల్లో వైరస్‌తో చనిపోతున్న కోళ్లకు బర్డ్ ఫ్లూగా నిర్ధారణ అయింది. పెరవలి మండలం కానూరు గ్రామ పౌల్ట్రీలలో తీసుకున్న శాంపిల్స్ పాజిటివ్‌గా వచ్చింది. దీంతో మరోసారి రెడ్ జోన్, సర్వే లెన్స్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. బర్డ్స్ ఎక్కడ చనిపోతున్నా పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేశారు.పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు, ఉంగుటూరు పరిసర ప్రాంతాల్లో సుమారు రెండు లక్షల కోళ్లు మృత్యువాత పడ్డాయి. బర్డ్ ఫ్లూ కలకలం నేపథ్యంలో కోళ్ల ఫారాల వద్ద పనిచేస్తున్న వారికి ఆరోగ్యశాఖ అధికారులు పరీక్షలు నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో జాగ్రత్తలు వహించాలని కోళ్లఫారాల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు.. బర్డ్ ఫ్లూ పెరుగుదల నేపథ్యంలో ఏపీ సర్కారు ముందస్తు చర్యలు చేపట్టింది.ఏపీలో బర్డ్ ఫ్లూ కలకలంతో తెలంగాణ సర్కారు అప్రమత్తం అయ్యింది. తెలంగాణ సరిహద్దు అయిన కృష్ణాజిల్లాలోనూ బర్డ్ ఫ్లూతో కోళ్లు చనిపోవటంతో.. అక్కడ నుంచి సరఫరాలను నిలిపివేశారు. తెలంగాణ సరిహద్దుల్లో 24 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో మూడు చెక్‌పోస్టులు పెట్టి.. ఏపీ నుంచి కోళు రాకుండా చూస్తున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనాలను.. అధికారులు వెనక్కి పంపుతున్నారు.బాయిలర్ కోళ్లకు బర్డ్ ఫ్లూ కారణంగా ఆంధ్రా- తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన రామాపురంలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఏపీ నుంచి తెలంగాణకు సరఫరా అయ్యే కోళ్లకు సంబంధించి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వాటిని తెలంగాణలోకి రాకుండా వెనక్కి పంపుతున్నారు. బర్డ్ ఫ్లూ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో.. వారం రోజులుగా తనిఖీలను ముమ్మరం చేశారు. ఏపీకి చెందిన ప్రతి వాహనాన్నీ.. తనిఖీ చేస్తున్నారు.సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం క్రాస్ రోడ్డు దగ్గర వెటర్నరీ అధికారులు, పోలీసులు చెకింగ్స్ చేస్తున్నారు. ఆంధ్ర నుంచి వస్తున్న కోళ్లను బ్యాన్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని తెలిపారు. ఈ నెల ఏడు నుంచి ఇంతవరకు ఏపీ నుంచి కోళ్ల వాహనాలు తెలంగాణలోకి రాలేదని చెప్పారు. తెలంగాణలో బర్డ్ ఫ్లూ లేనప్పటికీ.. జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.ఇదిలా ఉంటే.. ఆంధ్రలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తితో తెలంగాణలోని గద్వాల జిల్లా వెటర్నరీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి వస్తున్న కోళ్లు, కోడి పిల్లలు, బాతుల వాహనాలను అడ్డుకొని తిరిగి వెనక్కి పంపుతున్నారు. పుల్లూర్ టోల్ ప్లాజా వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. ఆంధ్రాలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాధితో భారీ సంఖ్యలో కోళ్లు చనిపోతుండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఇతర రాష్ట్రాల నుండి వస్తున్న కోళ్లను బోర్డర్‌లో అడ్డుకుంటున్నారు

# శివాలయంలో మాంసం ముద్దలు

**హైదరాబాద్ పెన్ పవర్:**
హైదరాబాద్ పరిధిలోని ఓ ఆలయంలో మాంసం ముద్దలు కనిపించడం కలకలం రేపుతోంది. భక్తుల నుంచి సమాచారం అందుకుని ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హైదరాబాద్ నగర పరిధిలో టప్పాచబుత్ర హనుమాన్ ఆలయంలో జరిగిందీ ఘటన. పూజలో భాగంగా ఫిబ్రవరి 12 బుధవారం ఉదయం ఆలయాన్ని తెరిచారు. అనంతరం పూజలు నిర్వహించేందుకు వచ్చిన భక్తులు శివ లింగం వెనుక మాంసం ముద్దలు చూసి అవాక్కయ్యారు. వెంటనే తేరుకుని ఆలయ పూజారికి, పోలీసులకు సమాచారం అందించారు. ఆలయం వద్దకు చేరుకున్న పోలీసులు ఘటనపై ఆరా తీస్తున్నారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న హిందూసంఘాల కార్యకర్తలు ఆలయానికి భారీగా చేరుకుని ఆందోళనకు దిగారు. ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయం పరిసర ప్రాంతం మొత్తం పోలీసులు,భక్తులు, హిందూ సంఘాలతో నిండిపోయాయి. ఎవరో కావాలనే ఇదంతా చేశారని భక్తులు ఆరోపిస్తున్నారు. కేవలం ప్రజల మధ్య విభేదాలు సృష్టించేందుకే ఇలా చేశారని మండిపడుతున్నారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాలను చెక్ చేస్తున్నారు పోలీసులు. ఘటనపై స్పందించిన బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్..కమిషనర్ ఈ కేసును ప్రత్యేకంగా చూడాలని కోరారు. పోలీసులపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, సీసీ ఫుటేజ్ పరిశీలించి ఇలాంటి ఘటనలకు పాల్పడినవారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే చిలుకూరు బాలాజీ ఆలయ పూజారి రంగరాజన్ పై కొందరు వ్యక్తులు దాడి చేశారు. రామరాజ్యం స్థాపనకు మద్దతు ఇవ్వాలని కోరగా అందుకు నిరాకరించారు రంగరాజన్. ఆయనతో పాటూ కుమారుడిని సైతం కొట్టారు. ఈ ఘటన ఓ వైపు కొనసాగుతోంది లేటెస్ట్ గా శివలింగం వెనుక మాంసం ముద్దలు వెలుగుచూశాయ్. దీంతో అసలేం జరుగుతోందనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయ్..భక్త కన్నప్పకి భక్తి తప్ప మరొకటి తెలియదు..తను ఏం చేసినా శివుడిపై భక్తితోనే చేశాడు. అమాయకత్వంతో శివుడిని ఇంటికి రమ్మని పిలిచి రాకపోవడంతో అలిగి అక్కడే ఉండిపోయి శివయ్యకు సపర్యలు చేశాడు. శివలింగం ఉన్న ప్రదేశాన్ని నిత్యం శుభ్రం చేశాడు. నోటితో నీళ్లు తీసుకొచ్చి అభిషేకం చేశాడు. ఆ పక్కనే ఉన్న ఆకులను శివుడికి సమర్పించాడు..అవే బిల్వ పత్రాలు. వేటాడి తీసుకొచ్చిన మాంసాన్ని నైవేద్యంగా సమర్పించాడు. చివరకు కంట రక్తం కారుతుంటే తన కన్ను తీసి అమర్చాడు.

ఇదంతా తిన్నడి అపరిమిత భక్తి మాత్రమే...అందులో ఎలాంటి మూర్ఖత్వం లేదు...కానీ..ఇప్పుడు జరిగిన చర్య కేవలం మూర్ఖత్వం కాక మరేంటి. సాధారణంగా మాంసాహారం తిన్న రోజున ఆలయానికి వెళ్లరు, ఆ రోజు కనీసం ప్రసాదం కూడా తీసుకోరు కొందరు. అలాంటిది నేరుగా పవిత్రమైన అలయంలోకి మాంసాహారాన్ని ఎలా తీసుకెళ్తారన్నదే హిందూ సంఘాల వాదన.మాంసాహారాన్ని నైవేద్యంగా సమర్పించే ఆలయాలూ ఉన్నాయి..కానీ..ప్రతి ఆలయానికి కొన్ని నియమాలుంటాయి..భక్తులు వాటిని పాటించాలి. అధిగమిస్తే ఇలానే ఆందోళనలు జరుగుతాయ్..

# రైతుల ఖాతాల్లోకి డబ్బులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రైతులను దృష్టిలో ఉంచుకొని బుధవారం ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. జనవరి 26వ తేదీన రైతు భరోసా పథకాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. తెలంగాణ వ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం అండదండగా నిలవాలన్న ఉద్దేశంతో రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇప్పటికే మొదటి దశలో పలువురు రైతులకు నగదు జమ కాగా, రెండవ దఫా రైతు భరోసా నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. తాజాగా మరో దఫా నిధులను కూడ ప్రభుత్వం విడుదల చేసింది.సాగులో ఉన్న రైతులందరికీ ఆర్థిక భరోసా కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టింది. జనవరి 26 తేదీన ఈ పథకానికి శ్రీకారం చుట్టగా, ఏడాదికి అర్హులైన రైతులందరికీ రూ. 12 వేలు ప్రభుత్వం అందిస్తోంది. అయితే రెండు విడతలుగా నగదు జమ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించగా, ఇప్పటికే పలువురు రైతులకు రూ. 6 వేలు నగదు ఖాతాలో పడింది. ప్రభుత్వం రైతన్నల పక్షాన నిలుస్తూ రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టగా.. ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్.. పేరుకే స్కీములు ప్రవేశపెడుతున్నారని విమర్శలు గుప్పించింది. దీనితో ప్రభుత్వం రైతులకు జమ వివరాలను కూడా ప్రజల ముందు ఉంచగా.. బీఆర్ఎస్ కు గట్టి ఎదురు దెబ్బ తగిలిందని చెప్పవచ్చు. తాజాగా ఈ పథకానికి సంబంధించి వ్యవసాయ శాఖ కీలక ప్రకటన చేసింది.ఇప్పటికే ఎకరా భూమి సాగులో ఉన్న రైతులకు నగదు జమ చేసిన ప్రభుత్వం, ఇటీవల రెండెకరాల లోపు సాగు భూమి ఉన్న రైతులకు నగదు జమ చేసింది. బుధవారం మూడు ఎకరాల వరకు సాగులో ఉన్న భూములకు సంబంధించి రైతుల ఖాతాల్లో నిధులు జమకానున్నట్లు ప్రకటన వెలువడింది. రైతుభరోసా పథకం అమల్లో భాగంగా ఏడాదికి రూ. 12 వేల నగదును ప్రభుత్వం రైతుల ఖాతాలో జమ చేయనుంది. అందులో భాగంగా రైతన్నలకు తొలివిడతగా రూ. 6 వేల నగదును జమ చేయనున్నారు. ఇప్పటి వరకు ఎకరా లోగా, రెండు ఎకరాలలోగా నగదు జమ చేసిన ప్రభుత్వం, తాజాగా మూడు ఎకరాల వరకు సాగు ఉన్న రైతుల ఖాతాల్లోకి నగదు విడుదల చేసింది. మరి మీ అకౌంట్ ఒకసారి చెక్ చేసుకోండి.

# ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**హైదరాబాద్ పెన్ పవర్:** చాదర్ ఘాట్ శంకర్ నగర్ బస్తి లో ఇప్పటికే ఇళ్ళు ఖాళీ చేసిన వాటిని అధికారులు కూల్చివేసి,మూసీ వెంట ప్రహరీ గోడ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా ఇళ్ల కూల్చివేతలు ఏం చేయడం లేదని,మూసీ పరివాహక ప్రజలు ఆందోళన చెందవద్దని కోరారు. బాధితులకు ప్రభుత్వ పరంగా రావాల్సిన ఆర్థిక సాయం,డబుల్ బెడ్ రూమ్ ఇల్లు అందే విధంగా కృషి చేస్తానని తెలిపారు.మూసీ పరివాహక ప్రాంతల్లో ఇప్పటికే ఖాళీ చేసినా బాధితులకు చంచల్ గూడ లో డబుల్ బెడ్ రూంలు కేటాయిచడం జరిగిందని మలక్ పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల తెలిపారు.